క్లుప్తంగా

ఎంఈవో కార్యాలయానికి చేరిన స్పోర్ట్స్ మెటీరియల్


క్రీడా పరికరాలు దించుతున్న దృశ్యం

ఎచ్చెర్ల: లావేరు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయానికి పలు పాఠశాలలకు సంబంధించి క్రీడా పరికరాలు చేరాయి. 56 ప్రాథమిక, 17 ప్రాథమికోన్నత, పది ఉన్నత, మూడు హైర్ సెకండరీ స్థాయి పాఠశాలలకు పరికరాలు వచ్చాయని ఎంఈవోలు ఎల్.ఈశ్వరరావు, ఎం.మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. పాఠశాలలకు త్వరలోనే మెటీరియల్‌ను పంపిణీ చేస్తామని చెప్పారు.

పరీక్షల పరిశీలన


పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎంఈవో రామకృష్ణ


గార: విద్యా సామర్థ్యాలు, అభ్యసనా సామర్థ్యాలు తెలుసుకునేందుకు ప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ప్రత్యేక సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తోంది. శుక్రవారం కె.మత్స్యలేశంలోని బుద్ధా పాఠశాలలో నిర్వహించిన పరీక్షను ఎంఈవో ఎస్.రామకృష్ణ పరిశీలించారు. తెలుగు, ఇంగ్లీషు, గణితంపై 6, 8, 9 తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రస్థాయి పరీక్షల ఫలితాలు ఆధారంగా వచ్చే విద్యా సంవత్సరాల్లో తీసుకోవాల్సిన చర్యలకు ఈ పరీక్షలు ఉపయోగపడతాయని ఎంఈవో తెలిపారు.

అంబేడ్కర్ పీఠం ఏర్పాటు చేయాలి


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఎచ్చెర్ల/ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో అంబేడ్కర్ పీఠం ఏర్పాటు చేయాలని సామాజిక న్యాయ పోరాటం రాష్ట్ర అధ్యక్షుడు కల్లేపల్లి రామ్ గోపాల్ కోరారు. ఎచ్చెర్లలో శుక్రవారం ర్యాలీ నిర్వహించి, అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. సనాతన ధర్మం పేరున జరుగుతున్న మతోన్మాదాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ నెల 19న ఎచ్చెర్లలో అంబేడ్కర్ జాతర్లో మేధావులు పాల్గొంటారని కోరారు. కార్యక్రమంలో కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు రాకోటి రాంబాబు, సమాజిక న్యాయ పోరాట సమితి జిల్లా కార్యదర్శి దుర్గాసి గణేష్, నాయకులు రమణ, అప్పారావు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ తాత్కాలిక అధ్యక్షునిగా శ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగర పీఆర్‌టీయూ అడహక్ కమిటీ ఎన్నికైంది. నగరంలోని అరసవెల్లి సంఘ భవనంలో శుక్రవారం జరిగిన సమావేశంలో శ్రీకాకుళం కార్పొరేషన్ పీఆర్‌టీయూ తాత్కాలిక అధ్యక్షునిగా ఎం.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా టి.కిషోర్, గౌరవాధ్యక్షుడిగా సీనియర్ హెచ్ఎం ఎం.చంద్రశేఖరరావులను ఎన్నుకున్నారు. సమావేశంలో పీఆర్‌టీయూ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు భైరి అప్పారావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పప్పల రాజశేఖర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి దానేటి కేశవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలు


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు సీపీఎం రాష్ట్ర నాయకులు ఏవీ నాగేశ్వరావు అన్నారు. ప్రజారక్షణ భేరి బస్సుయాత్ర శుక్రవారం చిలకపాలెం చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15న నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అసమానతులు లేని అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు తేజేశ్వరరావు, తులసీదాసు, లోకనాథం, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆహారం..ఆహ్లాదం..!


ఈ తరహాలోనే ఏర్పాటుకానున్న ఈట్ స్ట్రీట్‌లు..

- శ్రీకాకుళం నగరంలో ఈట్ స్ట్రీట్‌లు
- నగరప్రవేశ మార్గాల్లో స్వాగత ద్వారాలు
- సెంటర్ లైటింగ్ స్తంభాలకు రంగుల లైట్లు
- పలు పార్కుల అభివృద్ధికి చర్యలు
- సుమారు రూ.10 కోట్ల మున్సిపల్ సాధారణ నిధులతో పనులు


సెంటర్‌లైటింగ్‌కు ఉన్న ఇంటర్‌నెట్ వైర్లు తొలగిస్తున్న సిబ్బంది

శ్రీకాకుళం: సుందర శ్రీకాకుళం నగరం లక్ష్యంగా ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. నగర సుందరీకరణలో భాగంగా ఈట్ స్ట్రీట్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల(ఆర్ట్స్) కళాశాల రోడ్డులో స్టేడియం రోడ్డు నుంచి బలగ వాటర్ వర్క్ వరకు పలు రకాల తినుబండారాలు విక్రయించే వ్యాపార కేంద్రాలను నెలకొల్పాలని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు నిశ్చయించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలకు, వచ్చేవారికి ఆహ్లాదం కలిగించేలా లైటింగ్, కూర్చునేందుకు బెంచీలు, అందంగా ఆకట్టుకునేలా మొక్కలు పెంచాలని ప్రణాళికలు రూపొందించారు. డే అండ్ నైట్ జంక్షన్, ఏడు రోడ్ల జంక్షన్, పొన్నాడ వంతెనలపైనా ఇలాంటి ఏర్పాట్లు చేసేలా మున్సిపల్ అధికారులు అంచనాలు రూపొందించే పనులు చేపట్టారు.

నగర ప్రవేశంలో..

శ్రీకాకుళం నగరంలోని ప్రవేశ మార్గాలుగా ఉన్న నవభారత్ జంక్షన్, సింహద్వారం జంక్షన్, కొత్త రోడ్డు (బైపాస్) జంక్షన్, పెద్దపాడు రోడ్డు జంక్షన్‌లతో పాటు అరసవల్లి ప్రారంభంలో ఉన్న రోడ్ల వద్ద స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు ఇప్పటికే ఉన్న సెంటర్‌లైటింగ్ స్తంభాలకు రంగుల బల్బులు అమర్చనున్నారు. ఆయా స్తంభాలకు ఉన్న ఇంటర్నెట్ టెలికం కేబుల్ వైర్లు వారం రోజుల్లో తొలగించాలని ఆయా సంస్థల ప్రతినిధులకు సూచించారు.

పార్కుల అభివృద్ధిపై దృష్టి..

నగర సుందరీకణలో భాగంగా పార్కులు కూడా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. అరసవల్లి వద్ద పార్కు నిర్మాణం కోసం నగరపాలక సంస్థకు కేటాయించిన 2.77 ఎకరాల స్థలానికి రక్షణ గోడ నిర్మించి మొక్కలు నాటేలా అంచనాలు రూపొందించారు. పాత హౌసింగ్ బోర్డు కాలనీలో కార్గిల్ పార్కును కూడా అభివృద్ధి చేయనున్నారు. బైరివానిపేట (సీపాన్నాయుడుపేట) సమీపంలో విజయాదిత్య పార్కును రూ.1.50 కోట్లతో అభివృద్ధి చేస్తుండగా ఇప్పటికే 60 శాతం పనులు పూర్తయ్యాయి.

రూ.10 కోట్లతో అంచనాలు..

ఈ పనులన్నింటికీ సుమారు రూ.10కోట్లు ఖర్చవుతుందని ప్రాథమికంగా అంచనా వేసి కచ్చితమైన అంచనాలు రూపొందిస్తున్నారు. పనులు నాలుగు భాగాలుగా విభజించి వేర్వేరు వ్యక్తులకు టెండర్ విధానంలో పనులు ఖరారు చేయనున్నారు. జనవరి నెలాఖరు, ఫిబ్రవరి మొదటి వారంలో గాని పనులు పూర్తి చేసేలా లక్ష్యంగా తీసుకున్నారు. అంచనాలు పూర్తయిన వెంటనే కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారికి నివేదించి ఆమోదం పొందిన తర్వాత టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తారు.

మూడు నెలల్లో పూర్తయ్యేలా..



నవంబర్ 15లోగా పనుల కోసం కలెక్టర్ ఆమోదం పొంది టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తాం. సుందరీకరణ పనులు మూడు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా తీసుకున్నారు. మున్సిపల్ సాధారణ నిధుల నుంచి పనులు చేయాలని నిర్ణయించారు.

– చల్ల ఓబులేసు, నగరపాలక సంస్థ కమిషనర్, శ్రీకాకుళం

ఆరోగ్య గ్రామాలే లక్ష్యం


ఎచ్చెర్ల క్యాంపస్: వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

- ఎమ్మెల్యే కిరణ్‌కుమార్


రణస్థలం: సంచాంలో వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామాలన్నీ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. కేశవరావుపేట గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించగా.. ఎమ్మెల్యే పరిశీలించారు. గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహించి వైద్య అవసరాలు గుర్తించాలని సిబ్బందికి సూచించారు. 50 ఏళ్లు దాటిన వారు ఆరోగ్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. గ్రామం యూనిట్‌గా సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సమిష్టిగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల విజయవంతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంపురం పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, ఎంపీడీవో రమాదేవి, మండల పార్టీ అధ్యక్షుడు ముద్దాడ శంకర్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు పైడి భాస్కరరావు, నాయకులు మాడుగుల మురళీధర్‌బాబా, మండల యూత్ అధ్యక్షుడు కొత్తకోట సూర్యారావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగాల లక్ష్మణ, పైడి నర్సింగరావు, వెంకన్నగారి శ్రీను, చైతన్య, గొలివి రామకృష్ణ పాల్గొన్నారు.

రణస్థలం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. సంచాం గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిపుణులైన వైద్యులచే గ్రామాల్లోనే పేద ప్రజలందరికీ సంపూర్ణ వైద్యాన్ని అందిస్తున్నట్టు పేర్కొన్నారు. వైద్య పరీక్షలతోపాటు ఉచితంగానే మందులు అందజేస్తున్నట్టు చెప్పార. అలాగే గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు జగనన్న సంపూర్ణ పోషణ అందిస్తున్నామన్నారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి జగన్ ఎన్నో నూతన సంస్కరణలు, ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.వి.రమణమూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, నాయకులు చిల్ల వెంకటరెడ్డి, మైలపల్లి కామరాజు, సంచాం పంచాయతీ నాయకులు రెడ్డి రాము, రామకృష్ణ, ఆనంద్, మీసాల దాలినాయుడు, పండు, పతివాడ అప్పన్న, పప్పల వెంకినాయుడు, పున్నాన లక్ష్మంనాయుడు ఉన్నారు.

డబ్బుల బ్యాగులు దొరికాయి!


ఆటోవాలాకు దొరికిన రెండు బ్యాగులివే..

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం నగరంలో సింహద్వారం వద్ద ఓ ఆటోవాలాకు రోడ్డుపై రెండు బ్యాగులు దొరికాయి. వాటిని తెరిచి చూడగా పాతికి వేలకు పైగా నగదు ఉంది. రెండో పట్టణ ఎస్ఐ ఎస్.లక్ష్మణరావు, ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అక్టోబరు 22న రూట్ డైవర్షన్‌లో భాగంలో ఏ-1 హోటల్ వద్ద ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ నారాయణకు ఓ ఆటోవాలా.. తనకు సింహద్వారం సమీపంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద రెండు బ్యాగులు దొరికాయని.. అంతకు మించి వివరాలు తెలియవని వాటిని ఇచ్చేసి వెళ్లిపోయాడు. కానిస్టేబుల్ వెంటనే ట్రాఫిక్ పీఎస్‌లో డీఎస్పీ సీహెచ్‌జీవీ ప్రసాదరావుకు బ్యాగులు అందించారు. బ్యాగులు ట్రావెలర్స్‌కు చెందినవై ఉంటాయనే ఆలోచనతో కంట్రోల్ రూమ్ ద్వారా హైవే మొబైల్ వెహికల్స్‌కు సమాచారం అందించారు. వాటిని తనిఖీ చేయగా అందులో దుస్తులు తప్ప ఎటువంటి ఆధారాలు లభించలేదు. పది రోజులు గడిచినా ఎవరూ రాకపోవడం.. వివరాలు తెలియకపోవడంతో గురువారం మరోసారి ట్రాఫిక్ పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. బ్యాగు లోపల బాగా చిరిగిన నిక్కరులో రూ. 26,330 నగదు దొరకడంతో వెంటనే రెండో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై క్లెయిమ్ కాని ఆస్తి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రెండో పట్టణ ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు.

నేడు, రేపు ఓట్ల గుర్తింపు ప్రక్రియ


మాట్లాడుతున్న రిట్నరింగ్ అధికారి పద్మావతి

జి.సిగడాం: గ్రామస్థాయిలో శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓట్ల గుర్తింపు ప్రక్రియను చేపడుతున్నట్టు ఎచ్చెర్ల నియోజకవర్గం ఎన్నికల రిట్నరింగ్ అధికారి బెవర పద్మావతి, మండల అసిస్టెంట్ రిట్నరింగ్ అధికారి పప్పల వేణుగోపాలరావు తెలిపారు. ఈ నేపథ్యంలో బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక ఓట్ల గుర్తింపు కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. బీఎల్ఓలందరూ ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆయా వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఉండాలన్నారు. ఓటర్ల నుంచి అభ్యంతరాలు ఉంటే వాటిని పరిశీలించి పరిష్కరించాలన్నారు. సమావేశంలో డీటీలు ఎస్.నిర్మల, శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు ఉన్నారు.

రణస్థలం: 18 ఏళ్లు నిండిన యువతి యువకులు ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు శని, ఆదివారాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవెల్ అధికారులు అందుబాటులో ఉంటారని ఎచ్చెర్ల నియోజకవర్గం ఎన్నికల నమోదు అధికారిణి బి. పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని 309 పోలింగ్ కేంద్రాల్లో ఈ ప్రక్రియ ఉంటుందన్నారు.

ఇంద్రియనిగ్రహం పాటించాలి


సాయిప్రసాద్‌ను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: ఇంద్రియ నిగ్రహం లేనిదే సిద్ధిని పొందలేరని డాక్టర్ పి.వి.ఎస్.సాయిప్రసాద్ అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో జరుగుతున్న వాల్మీకి జయంతి ఉత్సవాలలో భాగంగా సీతా–రావణుల ధర్మ సంవాదంపై శుక్రవారం ప్రసంగించారు. రావణుడితో సీతమ్మ శ్రీరాముని గుణగణాలు తెలియజేసే ఘట్టాన్ని వివరించారు. కార్యక్రమంలో మందుల మోహనరావు, స్వామి, డాక్టర్ సనపల నారాయణమూర్తి, ఎం.రామారావు, ఎం.శ్రీనివాసరావు, జయరామాచార్యులు, తవుడు, రమ్య, కృష్ణవేణి, భారతి, కామేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామర్థ్య పరీక్షలు


జి.సిగడాం ఎంపీపీ పాఠశాలలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

జి.సిగడాం: మండలంలో పలు పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులకు సామర్థ్యపై ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. 3, 6, 9 తరగతుల విద్యార్థులు హాజరయ్యారు. ఎంఈవో-2 ముఖ్ల శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు చీర రాము, ముద్దాడ చిన్ని పర్యవేక్షించారు.

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని పలు పాఠశాలల్లో నేషనల్ అసెస్మెంట్ సర్వే 2023 సర్వేలో భాగంగా విద్యార్థులకు పరీక్షలను నిర్వహించారు. వెంకటాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పరీక్షలను ఎంఈవో-1 ఎల్.ఈశ్వరరావు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ఎం.మురళీకృష్ణ, ప్రధానోపాధ్యాయులు అరుణకుమారి, గణపతిరావు, పి.జగన్నాథరావు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ


మహేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: శ్రీకాకుళం నీరుపారుదలశాఖ సబ్ డివిజన్‌లో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన అలుగోలు మహేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. పెంట గ్రామంలో ఉంటున్న ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శుక్రవారం పరామర్శించారు. మహేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట అలుగోలు సురేష్‌కుమార్, మేటికోటి సత్యన్నారాయణ, సింహాద్రి విజయ్ శంకర్ ఉన్నారు.

సంక్షిప్తంగా..

పెండింగ్ పనులను పూర్తి చేయాలి: ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల: గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో చేపడుతున్న పెండిగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. లావేరు మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, కాలువలు, జలజీవన్‌మిషన్, ఇంటింటికీ కుళాయిలు, విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్‌లైన్ల ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు దన్నాన రాజిన్నాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ప్రతినిధి అలుపన నారాయణరెడ్డి, లావేరు పీఏసీఎస్ చైర్మన్ బూరాడ చిన్నారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు బొంతు సూర్యనారాయణ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కింతలి రమేష్‌బాబు, నాయకులు లంకలపల్లి గోపి, ఎంపీడీవో సురేష్, ఈవోపీఆర్డీ విశ్వేశ్వరరావు, పంచాయతీరాజ్ డీఈ సీతంనాయుడు, జేఈ అప్పన్న, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శివబాబు, ఎలక్ట్రికల్ ఏఈ అప్పన్న పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు అదృశ్యం

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని కిమ్స్ రోడ్డు సమీపంలో విశాల్ మార్ట్ వెనుక వైపు నివాసముంటున్న ఉపాధ్యాయుడు మొదలవలస గోవిందరావు తన వదిన అవమానించిందన్న బాధతో అదృశ్యమయ్యారు. ఈ మేరకు ఉపాధ్యాయుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగిరెడ్డి లక్ష్మణరావు శుక్రవారం పేర్కొన్నారు.

శతాధిక కవి సమ్మేళనానికి జిల్లా కవులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈ నెల 19న నిర్వహించే కవి సమ్మేళనానికి జిల్లా నుంచి పలువురు కవులు ఎంపికైనట్లు జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలో జరిగే 125వ జాతీయ స్థాయి శతాధిక కవి సమ్మేళనానికి మహ్మద్ రఫీ(ఈవేమన), వి.రాజారావు, జంధ్యాల శరత్‌బాబు, బి.కోటేశ్వరరావు, చిన్నాచారి, బుర్రి కుమారరాజు, ఉదయ్‌కిరణ్‌లు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

అయ్యప్ప ఆలయంలో మాలధారణ


మాలధారణ చేస్తున్న అర్చకులు శంకరనారాయణశర్మ

శ్రీకాకుళం కల్చరల్: బలగ అయ్యప్పస్వామి దేవాలయంలో శబరిమలకు వెళ్లే భక్తులకు శుక్రవారం మాలధారణ జరిగింది. అర్చకులు దేవరకొండ శంకరనారాయణ శర్మ ఆధ్వర్యంలో మాలధారణ నిర్వహించారు. వీరంతా 41 రోజుల దీక్ష అనంతరం శబరిమలలోని అయ్యప్ప దర్శనానికి వెళతారని అర్చకులు తెలిపారు.

దేవీ ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల: కుంచాలకుర్మయ్యపేట దేవీ ఆశ్రమంలో శుక్రవారం పలు ప్రత్యేక పూజలు జరిగాయి. ఇక్కడ ఉన్న దేవీ విగ్రహానికి పీఠాధిపతి బాలభాస్కరశర్మ అభిషేకాలు చేశారు. సుహాసినీలు కుంకుమార్చనలు నిర్వహించారు.

ఉమాజఠలేశ్వరునికి పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నక్కవీధిలోని ఉమాజఠలేశ్వరస్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అశ్వినీకుమార్, మహేష్‌ల ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

ప్రత్యేక అలంకరణలో విజయదుర్గ



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నానుబాలవీధిలో విజయదుర్గా దేవి ఆలయంలో అమ్మవారిని శుక్రవారం ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, కుంకుమార్చనలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

లాస్యకు 'ప్రతిభా అవార్డు'


అవార్డు అందుకుంటున్న లాస్య

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన 6వ తరగతి విద్యార్థిని సాధు లాస్య మన సంస్కృతి సంస్థ నిర్వహించిన ప్రతిభా పోటీల్లో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిందని స్కూల్ డైరెక్టర్ ముద్దాడ సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలోపారితోషికం, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందచేసినట్లు పేర్కొన్నారు. గత నెల 10న తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. లాస్యను యాజమాన్య ప్రతినిధులు అంధవరపు రవి కుమార్, రమేష్, ప్రిన్సిపాల్ తరుణి అర్జున్ చక్రవర్తి, ఉపాధ్యాయిని యు.అనూష అభినందించారు.